క్లుప్తంగా

మంత్రితో దళిత నాయకుల భేటీ



మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన దళిత నాయకులు

పుంగనూరు: రొంపిచెర్ల పర్యటనలో ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాష్ట్ర దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దళితుల సమస్యలను మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో దళిత నాయకులు గంగప్ప, చంద్రశేఖర్, అనురాధ, గంగరాజు, వెంకటాచలపతి, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గృహ సారథులకు శిక్షణ

పెద్దపంజాణి: మండలంలో నూతనంగా నియమించిన గృహ సారథులకు ఆదివారం శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ భాగారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనం వద్ద ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొంటారని చెప్పారు.

గ్రామ సారథుల పరిచయ కార్యక్రమం

పుంగనూరు: పట్టణంలోని పలు సచివాలయాల పరిధిలో గ్రామసారథుల పరిచయ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా నిర్వహించారు. పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీ, నానబాల వీధి, ఉబేదుల్లా కాంపౌండు ప్రాంతాల్లో నిర్వహించారు. నూతన కన్వీనర్ వరదారెడ్డిని పరిచయం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లలిత, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఫక్రుద్దీన్ షరీఫ్, కౌన్సిలర్లు సాజిదాబేగం, భారతి, కమలమ్మ, నయీంతాజ్, కొండవీటి గంగులమ్మ, రేష్మా, ఆదిలక్ష్మీ, యువకుమారి, జయభారతి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి పెన్షన్ అందజేత



పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ ప్రవల్లిక

సదుం: మండలంలోని జోగివారిపల్లెకు చెందిన చెంగమ్మాయులు గుండె ఆపరేషన్ చేయించుకుని తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసి వలంటీర్ ప్రవల్లిక తన సొంత ఖర్చుతో శుక్రవారం తిరుపతికి వెళ్లి పెన్షన్ నగదు అందజేయడంతో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమెను అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి



పలమనేరు: పలమనేరు ఫారెస్ట్ రేంజి పరిధిలోని మేలుమాయి వద్ద అనంతపురం–కృష్ణగిరి జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని శనివారం దుప్పి మృతిచెందింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది జింక కళేబరాన్ని పట్టణంలోని కార్యాలయం వద్దకు తరలించారు. వెటర్నరీ వైద్యుడు పోస్టుమార్టం చేశారు. అనంతరం కళేబరాన్ని దగ్ధం చేసినట్టు ఎఫ్‌ఆర్వో నయూమ్ అలీ తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ నాగరాజ

సోమల: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ నాగరాజ, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మండలంలో పని చేస్తున్న సిబ్బందికి వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ శాఖ జిల్లా కార్యదర్శి లోకేష్, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



కల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మెడికల్ ఆఫీసరు డా.జానకీరావు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని తగిన సమయంలో గుర్తిస్తే నయం చేయవచ్చని తెలిపారు. ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డా.కుముదవల్లి, డా.హరిప్రియ, హెల్త్ సూపర్‌వైజరు శారద, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

కుప్పంరూరల్: కుప్పం పట్టణంలోని హెచ్‌పీ రోడ్డులో వెలిసిన శ్రీ షిర్డీసాయి బాబా ఆలయం నిర్మించి 12 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఆదివారం వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు ఆలయంలో గణపతి హోమం, మృత్యుంజయ హోమం, 7 గంటలకు బాబాకు క్షీరాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం ఉంటుందన్నారు.

ప్రజల ఆదరణ మరువలేనిది



బొమ్మయ్యగారిపల్లెలో వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బండకిందపల్లెలో ప్రకృతి వ్యవసాయాన్ని వివరిస్తూ వేసిన ముగ్గును పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీపై ప్రజల ఆదరణ వెల కట్టలేనిదని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన పల్లెబాట కార్యక్రమంలో భాగంగా రొంపిచెర్ల మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గ ప్రజలు తమ పట్ల చాలా ఆదరణ చూపుతున్నారని, భవిష్యత్‌లో కూడా ఇలాగే ఆదరించాలని కోరారు. నియోజక వర్గంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ మూడున్నరేళ్లలో సీఎం జగన్ సహకారంతోనే అభివృద్ధి చేశామని తెలిపారు. 2019 కంటే 2024 సంవత్సరంలో జరిగే ఎన్నికలలో మరింతా గొప్ప విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే, అప్పటికప్పుడే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనుల ప్రారంభం..

మండలంలోని బండకిందపల్లె, పెద్దగొట్టిగల్లు, బొమ్మయ్యగారిపల్లె, రొంపిచెర్ల గ్రామ పంచాయతీల్లో మంత్రి పెద్దిరెడ్డి శనివారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. బండకింపల్లె, బొమ్మయ్యగారిపల్లె, రొంపిచెర్ల పంచాయతీల్లో రూ.66 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాలను ప్రారంభించారు. అలాగే ఫజులుపేటలో రూ.22 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. మేకలవారిపల్లె, చల్లావారిపల్లె, చిన్న మసీదువీధి, లక్ష్మీ నారాయణ కాలనీల్లో రూ.54 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చల్లా లక్ష్మీ, సీఐ ఆశీర్వాదం, ఎస్‌ఐ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజేంద్ర, తహసీల్దార్ అమరనాథ్, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, అన్సర్ బాషా, సుష్మా, నాగిరెడ్డి, నాయకులు సలీంబాషా, చెంచురెడ్డి, వెంకటరమణ, యర్రంరెడ్డి, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, విజయభాస్కర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, యుగంధర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, విజయకుమార్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో మీరే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ఈ ప్రభుత్వంలో జరిగిన మేలును ఇంటింటికి గుర్తు చేయండి
- వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేయాలి
- తప్పుడు సమాచారం ఇస్తే ప్రభుత్వాన్ని మోసం చేసినట్టే
- గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



గిరిజా కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: గడిచిన మూడున్నరేళ్లలో ఈ ప్రభుత్వం ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని, ప్రభుత్వం చేసిన మేలును ప్రతి గడపకు వెళ్లి వివరించి, వచ్చే ఎన్నికల్లో సీఎం జగనన్నను ఆదరించాలని తెలియజెప్పాలని వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లకు ఎమ్మెల్యే వెంకటేగౌడ సూచించారు. పలమనేరు మున్సిపాలిటీకి సంబంధించిన కౌన్సిలర్లు, వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కంటే ఈ ప్రభుత్వంలో మేలు జరిగిందా లేదా ? అనే సమాచారాన్ని ఇంటింటికి వెళ్లి వారి ద్వారానే తెలుసుకోవాలని సూచించారు. మంచి జరిగి ఉంటే అవునని లేదంటే లేదని టిక్ వారి చేత చేయించాలన్నారు. సర్వే పటిష్టంగా చేపట్టాలని లేదంటే ప్రభుత్వాన్ని మనమే మోసం చేసినట్టు అవుతుందన్నారు. దీనిపై సంబంధిత వార్డు కౌన్సిలర్లు దగ్గర ఉండి పర్యవేక్షించాలని సూచించారు. తమవల్ల కాదని ఎవరైనా కౌన్సిలర్లకు చెబితే వారి స్థానంలో ఆ వార్డులో వేరొకరిని ఇన్‌చార్జ్‌గా పెడతామన్నారు. ఈ సర్వేపై ప్రతి వార్డులోనూ పరిశీలకులు ఉంటారని, అభిప్రాయ సేకరణ పటిష్టంగా, నిజాయితీగా చేయాలని సూచించారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలుతో ప్రజలు మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించేలా చేయడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. ఇంటింటికి వెళ్లి వారికి సమ్మతంగా ఉంటేనే జగనన్న స్టిక్కర్ అంటించాలని, అదేవిధంగా స్మార్ట్‌ఫోన్ ఉన్న వారికి స్టిక్కర్ ఇవ్వాలని తెలిపారు.

పేర్నాటిని గెలిపించుకుందాం..

తూర్పురాయలసీమ(ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇందుకు సంబంధించిన క్యాలెండర్లను ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి పట్టభద్రులు తొలి ప్రాధాన్యత ఓటును వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

సంతాపం తెలిపిన ఎమ్మెల్యే..

మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరులో అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తిప్పయ్య మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబీకులకు సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఎస్‌కేఎస్ జాఫర్, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, మాజీ కన్వీనర్ మండీసుధా, మున్సిపల్ వైస్ చెర్మన్లు చాన్మాకమాల్, కిరణ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు రఘునాథ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గిరిజా కల్యాణం

పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో గిరిజ కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయం వద్ద ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం యథావిధిగా గ్రామోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పట్టణానికి చెందిన ఆర్‌బీసీ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో గిరిజా కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు వేద ఆశీర్వాదం అందజేశారు. ఆదివారం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ, ఆలయ ట్రస్టు చైర్మన్ వీరభద్ర తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, నాయకులు మురళీకృష్ణ, చలపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజల మధ్యకు..



గ్రామస్తులకు మూడేళ్ల అభివృద్ధి బావుటా బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

– ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల మధ్యకు వస్తున్నామని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని ఎస్.కొత్తపల్లి, కూతేగానిపల్లి గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 190 గృహాలకు వెళ్లి మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వారికి కలిగిన లబ్ధిని వివరించి, సంక్షేమ బావుటాను అందజేశారు. అలాగే గ్రామస్తుల నుంచి వచ్చిన చిన్న చిన్న సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా మహిళల నుంచి పెద్దఎత్తున ఆయనకు హారతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల కాలంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారన్నారు. అందుకే ఇప్పుడు తాము ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఆప్యాయంగా పలకరిస్తూ, హారతులు పడుతున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో ప్రజలు సమస్యలతో విసిగి వేశారిపోయారని, ప్రస్తుతం తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పాటు అనేక అభివృద్ధి పనులు జరుగుతుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కుప్పంలో అయితే ఇదివరకు ఏ పథకం కావాలన్నా, జన్మభూమి కమిటీలు, నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థ తీసుకురావడంతో పథకాలే ప్రజలను వెతుక్కుంటూ వెళ్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, వృద్ధులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని దీవించారు. ప్రజల ఆశీర్వాదంతో 2024లో మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ శరవణ, మండల కన్వీనర్ మురుగేష్, నాయకులు గోవిందన్, ఈశ్వర్, శరవణ, రామచంద్రన్, శీను తదితరులు ఉన్నారు.

విజేతలకు అభినందనలు



మెడల్స్ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు

శాంతిపురం: ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన తుమ్మిశి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు, నాయకులు అభినందించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పతకాలు సాధించిన 10 మంది విద్యార్థులను ప్రశంసించారు. గత నెల 31 నుంచి మూడు రోజుల పాటు రాజమండ్రిలో జరిగిన పోటీల్లో మొత్తం 15 మంది పాల్గొని 10 బహుమతులు సాధించడంలో పాఠశాల పీడీ సురేంద్రబాబు కృషి ఎనలేనిదన్నారు. అండర్–17 బాలికల విభాగంలో వి.ఐశ్వర్య, ఎం.ఉషారాణి, వి.అక్షయ వెండి పతకాలను, అలాగే వై.తనుశ్రీ, ఎస్.నవీన, ప్రియదర్శిని కాంస్య పతకాలను సాధించారు. అలాగే అండర్–14 బాలుర విభాగంలో ఎం.వెంకటేష్, వి.హేమచంద్ర వెండి పతకాలు, జి.కె.గుణశేఖర్ కాంస్య పతకాలను సాధించి ప్రతిభ చూపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధనలక్ష్మి, వైస్ ఎంపీపీ పట్టాభి, స్థానిక సర్పంచ్ చంగమరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మసెమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పుంగనూరు: మండలంలోని ఆరడిగుంట పంచాయతీ కొండచెర్ల కురప్పల్లె గ్రామంలో శనివారం సాయంత్రం మసెమ్మ దేవత జాతరను వైభవంగా ప్రారంభించారు. అమ్మవారిని పుష్పపల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు తొలిపూజ నిర్వహించారు. అలాగే గ్రామంలోని కుంటిగంగమ్మ, ధనకుంట గంగమ్మ, బోయకొండ గంగమ్మ, నడివీధి గంగమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. పురవీధుల్లో బళ్లారి డ్రమ్ములు, మేళతాళాలు, నృత్యాలు, చక్క భజనలు, కర్రసాము, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అంగరంగ వైభవంగా అమ్మవారిని ఊరేగించారు. ఆదివారం భక్తుల దర్శనార్థం అమ్మవారిని ఆలయం వద్ద ఉంచుతారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి అమ్మవారిని దర్శించి, ప్రజ లకు జాతర శుభాకాంక్షలు తెలిపారు. 30 గ్రామాలకు చెందిన ప్రజలు తరలిరావడంతో కురప్పల్లె కిటకిటలాడింది.

నేడు మంత్రి పెద్దిరెడ్డి రాక..

మంత్రి పెద్దిరెడ్డి ఆదివారం ఉదయం మసెమ్మ జాతరలో పాల్గొని పూజలు నిర్వహిస్తారని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు.

అందరికీ అందుబాటులో ప్రభుత్వ వైద్యం



ముడిబాపనపల్లె పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు ఇంటి వద్దనే వైద్యం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎంపీపీ, మండల పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ముడిబాపనపల్లె పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ సల్మా, తహల్దార్ సీతారామన్, ఎంపీడీఓ రాజేశ్వరితో కలసి ఆస్పత్రిని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడే కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వారంలో రెండుసార్లు డాక్టర్లు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వైద్యసేవలు అందిస్తారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రతి సచివాలయ పరిధిలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి, అందుకు అవసరమైన సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం పట్టణ ప్రభుత్వాస్పత్రిలో వెంటిలేటర్లు, ఆక్సిజన్ యూనిట్‌తో పాటు ప్రసూతి కేంద్రం, చిన్నపిల్లల కేంద్రాలు ఏర్పాటు చేసి, అందరికీ ప్రభుత్వ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు.

పౌష్టికాహారం పంపిణీ..

పుంగనూరు: మండలంలోని చదళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పౌష్టికాహారాన్ని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పంపిణీ చేశారు. శనివారం ఆయన చదళ్ల అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండేందుకే ప్రభుత్వం నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీ చేస్తోందన్నారు. అలాగే అంగన్‌వాడీ భోజన పథకం, ప్రీప్రైమరీ స్కూల్‌గా మార్పు చేసి, పిల్లలకు చిన్నతనం నుంచే చదువులపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలిస్తున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రాజేశ్వరి, తహసీల్దార్ సీతారామన్, నాయకులు చంద్రారెడ్డి యాదవ్, చంద్రారెడ్డి, బాలచంద్రారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యను మించిన సంపద లేదు



విద్యార్థిని యశ్విక, తల్లిదండ్రులను అభినందిస్తున్న ప్రముఖులు

శాంతిపురం: విద్యను మించిన సంపద లేదని కుప్పం మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ అన్నారు. కూతేగానిపల్లి వద్ద ఉన్న శ్రీపరమహంస యోగానంద పాఠశాలలో శనివారం జరిగిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల్యంలో క్రమశిక్షణ, విషయాలను తెలుసుకోవాలనే ఉత్సాహం ఉన్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకుంటారని చెప్పారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో విజేతగా నిలిచిన 4వ తరగతి విద్యార్థిని వై.యశ్వికను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోపాల్ అగర్వాల్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణి రెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ రాధాకృష్ణ, ప్రిన్సిపల్ ఆజాద్‌హుస్సేన్, స్థానిక సర్పంచ్ మురళి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు



స్టాక్ నిల్వలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణశాస్త్రి

సదుం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సిబ్బంది మద్యం డిపో నుంచి స్టాకు వచ్చినప్పుడు సరి చూసుకోవాలని చిత్తూరు డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి అన్నారు. శనివారం ఆయన పులిచెర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సదుం గ్రామంలో వివిధ మద్యం దుకాణాల్లో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాకు దింపే సమయంలో సూపర్‌వైజర్ అందుబాటులో ఉండలన్నారు. మద్యం అమ్మగా వచ్చిన నగదును సంబంధిత బ్యాంకుల్లో చలానా రూపంలో జమ చేయాలన్నారు. లేదంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



చెరువుకట్ట వద్ద కూలీలతో మాట్లాడుతున్న పోకల చినతాతయ్య

పులిచెర్ల(కల్లూరు): అమృత్ సరోవర్‌లో భాగంగా ఉపాధిహామీ పథకం కింద మండలంలోని పులిచెర్ల పంచాయతీ దాసరికుంట కట్ట బలోపేత పనులను శనివారం రాష్ట్ర ఉపాధిహామీ పథకం డైరెక్టరు పోకల చినతాతయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు కట్టల బలోపేతం చేయడం ద్వారా చెరువుల్లో నీరు బయటకు పోకుండా ఉండడంతో పాటు నీరు ఇంకి భూగర్భ జలాల మట్టం పెరుగుతుందన్నారు. ఉపాధిలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలని తెలిపారు. పనుల దగ్గర కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. ఉపాధిహామీ స్టేట్ కౌన్సిల్ మెంబరు ముత్తంశెట్టి విశ్వనాథ్, జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు గంగా భవానీ, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, ఎంపీడీఓ సుగుణమ్మ, నాగరాజ ప్రసాద్, ఏపీఓ సౌకత్‌అలీ, ఈసీ కృష్ణ, ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్, గోపీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధితో భూగర్భజలాల పెంపు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు

సోమల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా అమృత్ సరోవర్ పథకం కింద చెరువులను అభివృద్ధి చేయడం ద్వారా వ్యవసాయబోర్లలో నీటి మట్టం పెరిగి రైతులకు లబ్ధి చేకూరుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు అన్నారు. శనివారం వారు మండలంలోని నెల్లిమంద పంచాయతీ కనుగలకుంట వద్ద నిర్వహిస్తున్న పూడికతీత పనులను ఎంపీడీఓ నాగరాజతో కలిసి పరిశీలించారు. కూలీలకు 100 రోజులు పనులు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఇలాంటి పనులను ప్రోత్సహిస్తోందన్నారు. చెరువుల్లో పూడికతీత ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ఏపీఓ దినకర్ బాబు, జేఈ రెడ్డెప్ప, పార్టీ నేత రమణ పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె–1 అంగన్‌వాడీ కార్యకర్తగా సల్మా, బోనమంద అంగన్‌వాడీ మినీ కార్యకర్తగా ఝాన్సీ నియామకం అయ్యారు. వీరికి శనివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, ఎంపీడీఓ నాగరాజ, మండల మైనారిటీ అధ్యక్షుడు మస్తాన్‌వలీ, ఎంపీటీసీ సర్వేశ్వరి, సర్పంచ్ విమల పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యురాలు చంద్రమ్మకు నివాళి



ఎంపీడీఓ కార్యాలయంలో చంద్రమ్మ మృతికి సంతాపం తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, అధికారులు

వి.కోట: మండలంలోని ఎస్.బండపల్లి, ఓగు సెగ్మెంట్ ఎంపీటీసీ చంద్రమ్మ శనివారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఈమె ఆస్తమాతో బాధ పడుతున్నారు. పరిస్థితి విషమించి శనివారం ఉదయం ఆమె ఇంట్లోనే చనిపోయారు. విషయం తెలిసి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీపీ యువరాజు మృతురాలి ఇంటికి చేరుకుని ఆమె పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అయితే శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తూ చంద్రమ్మ మృతి చెందిన సందర్భంగా సంతాప తీర్మానం ప్రవేశపెట్టి, ఎంపీటీసీ చంద్రమ్మకు నివాళులు అర్పించారు.

టీడీపీ సీనియర్ నేత మృతికి నివాళి..

మండలంలోని చింతమాకులపల్లి పంచాయతీ పసలమంద గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త రాజేంద్ర ఆచారి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ గ్రామానికి చేరుకుని పార్థివదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కార్యకర్త తల్లి మృతదేహానికి నివాళి

గంగవరం: మండలంలోని కీలపట్ల పంచాయతీ జరావారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రవి తల్లి నాగమ్మ శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ జరావారిపల్లికి చేరుకుని నాగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు రఘునాథరెడ్డి, శంకర్‌రెడ్డి ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

గుడిపాల: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆరోగ్య విద్యాధికారి గుణశేఖర్ అన్నారు. సీఎస్‌ఆర్ కళాశాలలో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ రావడానికి తీసుకునే ఆహార పదార్థాలు, శీతల పానీయాలేనని కారణ మన్నారు. పొగతాగడం, గుట్కా, గంజాయి, పొగాకు, మద్యపానం వల్ల క్యాన్సర్ వస్తుందన్నా రు. అనంతరం క్యాన్సర్ నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కరస్పాండెంట్ లోకేష్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, సీహెచ్‌ఓ నరసింహమూర్తి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.